## అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా పీర్లతండాలో విషాదం



నారాయణఖేడ్, నవంబర్ 7: అప్పుల బాధలు తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పీర్లతంకు చెందిన వడిత్య విఠల్‌నాయక్ (36) తనకున్న రెండెకరాల భూమిని సాగు చేసుకోవడంతోపాటు చెరుకు నరికే పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పంటల పెట్టుబడుల కోసం రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులోళ్ల బాధలు భరించలేక మనస్తాపానికి గురయ్యాడు. విఠల్‌నాయక్ తన చేనులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు నారాయణఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## ఇథనాల్ పరిశ్రమలు పెట్టొద్దు

- రైతు సంక్షేమ కమిషన్‌కు రైతుల ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుతో ఆరోగ్యంపై దుష్ప్రభావంతోపాటు పర్యావరణానికి పెనుముప్పు కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో గురువారం ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుపై రైతు సంక్షేమ కమిషన్ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇథనాల్ పరిశ్రమల స్థాపనను వ్యతిరేకరిస్తూ చైర్మన్ కోదండరెడ్డికి ఫిర్యాదు చేశారు. కోదండరెడ్డి మాట్లాడుతూ త్వరలో మహబూబ్‌నగర్, నిర్మల్ జిల్లాలో కొనసాగుతున్న ఇథనాల్ పరిశ్రమలతోపాటు ప్రతిపాదిత ప్రాంతాలకు వెళ్లి రైతులతో మాట్లాడతామని పేర్కొన్నారు. రైతుల అభీష్టానుసారమే ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు.

# మిల్లులకే సన్నాలు

- ఉమ్మడి జిల్లా నుంచి మిర్యాలగూడకు ధాన్యం
- తేమ శాతం కొర్రీతో ఐకేపీ కేంద్రాల వైపు చూడని రైతులు
- బోనస్ కోసం చూస్తే ధాన్యం దెబ్బ తింటుందని ఆవేదన
- రేటు తక్కువైనా మిల్లర్లకు అమ్ముకునేందుకే మొగ్గు



మిర్యాలగూడ శివారులోని మిల్లుల వద్ద నిలిచిన ధాన్యం ట్రాక్టర్లు

మిర్యాలగూడ, నవంబర్ 7: ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సన్న ధాన్యం మిర్యాలగూడలోని మిల్లులకు తరలివస్తున్నది. వానకాలం సీజన్‌లో ముందస్తుగా బోర్లు, బావుల కింద సాగు చేసిన రైతులు చేతికి వచ్చిన పంటను మిల్లుల వద్ద అమ్ముకునేందుకు తీసుకువస్తున్నారు. మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో 80 రైస్ మిల్లులు ఉండగా, ప్రస్తుతం 45 మిల్లుల్లో సన్న ధాన్యం విక్రయాలు ప్రారంభించారు. సన్న రకాల్లో హెచ్‌ఎంటీ, కావేరి చింట్లు, చిట్టిపొట్టి, పద్మ వంటి హైబ్రిడ్ వంగడాలను పొలం మీదే యంత్రాల ద్వారా కోసి మిల్లులకు విక్రయిస్తున్నారు. ఈ ధాన్యం రకాలకు మిల్లర్లు రూ.2,300 నుంచి రూ.2,500 వరకు చెల్లిస్తున్నారు. రైతులు పచ్చి ధాన్యం ఆరబోయకుండా నేరుగా విక్రయించుకుని వెళ్తున్నారు.

- **సన్నవడ్లను ఆరబెట్టి అమ్మడం కష్టం**



కోత మెషిన్‌తో పొలం కోసి మిల్లుకు తీసుకుపోతే అదే అమ్ముకుని ఇంటికి వస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చే బోనస్ కోసం చూస్తే కోసిన పంట పాడయ్యే పరిస్థితి ఉంటుంది. ఐకేపీ కేంద్రాల్లో నిబంధనల ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. రూపాయి తక్కువైనా మిల్లులకే వడ్లు అమ్ముతున్నాం.

**-మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, రైతు, శెట్టిపాలెం**

### బోనస్ కోసం చూస్తే ధాన్యం చెడిపోతది

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటిలో దొడ్డు రకం కొనుగోళ్లకు 260, సన్నాలకు 80 కేంద్రాలను కేటాయించింది. కానీ, సన్న ధాన్యం పండించిన రైతులు ఐకేపీ కేంద్రాల్లో విక్రయించేందుకు ఆసక్తి చూపడం లేదు. 17 శాతం తేమ కొర్రీతో కొనుగోలు కేంద్రాల్లో బోనస్ వచ్చే పరిస్థితి లేదు. ధాన్యం ఆరబెట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు తలకుమించిన భారంగా మారింది. 20 రోజుల నుంచి వరుస వర్షాలు, వాతావరణం మబ్బులు పట్టి ఉండటంతో ధాన్యాన్ని ఎండబెట్టి ఐకేపీ కేంద్రాల్లో విక్రయించడం కష్టంగా భావిస్తున్నారు. కోసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లుల వద్ద విక్రయించుకుని వెళ్తున్నారు. బోనస్ దక్కకపోయినా రైతులు మిల్లల వద్దకే వెళ్తున్న పరిస్థితి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 85 శాతానికిపైగా రైతులు సన్న రకం వరి వంగడాలను పండించారు. ఈ పంటను యంత్రాలతో కోసి నేరుగా రైతులు మిల్లర్ల వద్దే విక్రయిస్తున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మిర్యాలగూడ రైస్ మిల్లులకు ఇప్పటివరకు 1.12 లక్షల టన్నులకుపైగా సన్న ధాన్యం వచ్చినట్టు మిల్లర్లు చెప్తున్నారు.



### రంగు మారితే మొదటికే మోసం



బోర్ల ఆధారంగా నేను నాలుగెకరాల్లో సన్న వడ్లు పండించాను. రెండు ట్రాక్టర్ల ధాన్యాన్ని మిర్యాలగూడలోని మిల్లులో అమ్మాను. ధర రూ.2,350 ధర పడింది. నిబంధనల ప్రకారం ఐకేపీ కేంద్రాల్లో సన్న వడ్లను ఆరబెట్టి అమ్మడం ప్రయోజనం లేని పని. ఐకేపీ కేంద్రాల్లో పోస్తే ధాన్యం దెబ్బతింటున్నది. రంగు మారితే మొదటికే ముప్పు. ప్రభుత్వం ఇస్తామంటున్న బోనస్ కూడా వస్తుందో, రాదో తెలియని పరిస్థితి. అందుకే మిల్లుకే అమ్ముకున్నా.

**-బంటు శ్రీను, రైతు, వేములపల్లి**

# సన్నాలకూ బోనస్.. బోగస్

మొదటిపేజీ తరువాయి...

కోసం 260, సన్నవడ్ల కోసం ప్రత్యేకంగా 80 కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటివరకు దొడ్డురకం కొనుగోలు కేంద్రాలకు మాత్రమే ధాన్యం వచ్చింది. ఈ కేంద్రాల్లో సుమారు లక్ష టన్నుల ధాన్యం వరకు వచ్చి ఉండగా 20 వేల టన్నులను మాత్రమే కొనుగోలు చేశారు. మిగతా ధాన్యం విషయంలో మిల్లర్ల పేచీ, ట్రాన్స్‌పోర్ట్ సమస్య, కాంటాలు కాకపోవడం వంటి సమస్యలతో తీవ్ర జాప్యం జరుగుతున్నది. కొనుగోలు చేసే మిల్లర్లకు సన్నాల్లోని తేమశాతంతో నష్టంలేదు. అందువల్ల ఈ సారి కూడా నేరుగా రైతులు సన్నాలను రైస్ మిల్లులకే అమ్ముకుంటున్నారు. క్వింటాకు రూ.2,200 నుంచి రూ.2,400 వరకు ధర లభిస్తుంది. ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్ కోసం ఆశ పడితే అసలుకే ఎసరు వస్తుందన్నది రైతుల భావన. కొనుగోలు కేంద్రాల్లో సన్నాలను విక్రయించాలంటే 17శాతం తేమ ఉండాలన్నది ప్రాథమిక నిబంధన. కానీ సన్నాలకు అదీ సాధ్యం కాదనేది రైతుల అభిప్రాయం. ఇంత ప్రహసనం కంటే కోసిన వడ్లను పొలం నుంచి నేరుగా మిల్లులకు తరలిస్తే తూకంలోనూ బోనస్ మందం కలిసి వస్తుందని రైతులు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వ బోనస్ వైపు సన్నాల రైతులు ఆలోచించడమే మానేశారు. నిజంగా ప్రభుత్వ మద్దతు ధరకు బోనస్‌తో కలిపి రైతులకు ఒక్కో క్వింటాల్ సన్నాలకు రూ.2,820 ధర దక్కాలి. కానీ నేటికీ నల్లగొండ జిల్లాలో ఏ ఒక్క రైతుకు ఈ ధర లభించిన దాఖలాలు లేవు.



- **బోనస్ కోసం చూసే పరిస్థితి లేదు**

తేమ శాతంతో సంబంధం లేకుండా రైస్ మిల్లర్లు ధాన్యం కొంటున్నరు. తేమ శాతం 17 కోసం చూస్తే అంత మందం తూకంలో తేడా వస్తుంది. రూ.500 బోనస్ కోసం ఆశ పడితే రోజుల తరబడి తిప్పలు పడాల్సిందే. అందుకే నేరుగా మిల్లులకు అమ్ముకుంటున్నం. నిజంగా ప్రభుత్వానికి రైతుల మీద ప్రేమ ఉంటే మిల్లుల వద్ద అమ్ముకున్న సన్నాలకు సైతం బోనస్ ఇవ్వాలి. మిల్లుల వద్ద కూడా ప్రభుత్వం మద్దతు ధర రూ.2,320కి తగ్గకుండా వచ్చేలా చూడాలి.

**- నక్క పురుషోత్తం, రైతు, శెట్టిపాలెం**

### ఇక సన్నాల కొనుగోళ్లు నేటి వరకు శూన్యం

నల్లగొండ జిల్లాలో సన్నాల కోసం ప్రత్యేకంగా 80 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకూ ఒక్క గింజ కూడా రాలేదు. మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్‌తోపాటు వేములపల్లి మండలంలో మూడు సన్నాల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైతులు నేటికీ ఒక్క గింజా తేలేదు.

### మద్దతు ధరనే లేదు..

మిర్యాలగూడ రైస్‌మిల్లుల యజమానులు సిండికేట్ అయ్యారు. రైతులకు రకరకాల సాకులతో మద్దతు ధరకు ఎగనామం పెడుతున్నరు. నాణ్యమైన సన్నాలకు సైతం రూ.2,300 ఇస్తున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతులకు పూర్తి మద్దతు ధర లభించింది. అవసరమనుకుంటే స్థానిక ఎమ్మెల్యే, నాయకులు రైస్ మిల్లర్లతో మాట్లాడి మద్దతు ధర చెల్లించేలా రైస్‌మిల్లర్లను ఒప్పించేవారు. నేడు మద్దతు ధరనే సరిగ్గా వస్తలేదు. ఇక రేవంత్‌రెడ్డి ఇస్తానన్న బోనస్ గురించి ఎవ్వరూ ఆలోచించే పరిస్థితి లేదు.

**-కారంగుల గోపి, తక్కెళ్లపహాడ్, మిర్యాలగూడ మండలం**



నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో ధాన్యం కల్లం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

## ‘ప్రైవేటు’లో అమ్మినా బోనస్ ఇవ్వాలి

- సర్కార్‌కు వేముల డిమాండ్
- మోర్తాడ్‌లో రైతుల గోడువిన్న మాజీ మంత్రి

మోర్తాడ్, నవంబర్ 7: అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన పలు కార్యక్రమాలకు వెళ్తూ మార్గమధ్యంలో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ వద్ద ఆగారు. వడ్లను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వమే క్వింటాలుకు రూ.2,800 ధరతోపాటు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కొంటామంటుండగా, ప్రైవేటు వ్యాపారులకు ఎందుకు అమ్ముకుంటున్నారని రైతులను ప్రశ్నించారు. కల్లాల మీదికి వడ్లు తీసుకువచ్చి 20 రోజులు గడుస్తున్నదని, ప్రభుత్వం బోనస్ ఇచ్చి వడ్లు కొంటుందన్న నమ్మకం లేక వ్యాపారులకు అమ్ముకుంటున్నామని రైతులు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం ఆలస్యమైనందున, ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్న రైతులకు కూడా క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలని సూచించారు. దళారులకు అమ్ముకున్న వడ్లకు కూడా బోనస్ చెల్లించాలని అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.



కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

## పత్తిని కొనుగోలు చేయాలి


నాగర్‌కర్నూల్, నవంబర్ 7: తేమ సాకు చూపి సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిని నిరసిస్తూ.. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం రాంరెడ్డిపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు రోడ్డుపై బైఠాయించారు. వర్షాలు భారీగా కురవడంతో ఇప్పటికే నష్టాలపాలయ్యామని, చేతికొచ్చిన కొద్దిపాటి పంటను కూడా తేమ సాకు చూపి కొనుగోలు చేయడం లేదని వాపోయారు. రైతుల పంటను కాకుండా దళారులు తెచ్చిన వాటిని కొనడం ఏమిటని నిలదీశారు. రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రైతు సంఘం నేతలు

## ఖమ్మంలో పత్తి రైతుల ఆందోళన

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 7 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట పత్తి రైతులు ఆందోళనకు దిగారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, జెండా పాట లేకుండా.. తేమ శాతం నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, నాయకులు నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,521 చొప్పున లభించే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.5 వేల నుంచి రూ.6,700కు మాత్రమే ధర పలుకుతుండటంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పత్తి రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కొనుగోళ్ల సమయంలో ధర నిర్ణయిస్తే.. కాంటాలు పెట్టేటప్పుడు కోత పెట్టి రైతులకు నష్టం కలిగించడంపై మార్కెట్ కార్యదర్శి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



మునుగోడు మండలం సరంపేటలోని హరిహర కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

## పత్తి కొంటరా.. కొనరా?

### నల్లగొండ జిల్లా సరంపేటలో రాస్తారోకో

మర్రిగూడ, నవంబర్ 7 : కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా పత్తి కొనడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట హరిహర కాటన్‌మిల్లు, యరగండ్లపల్లిలోని శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి కాటన్‌మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. తాము పత్తిని తీసుకొచ్చిన కొనడం లేదంటూ రైతులు గురువారం ఆందోళనకు దిగారు. సరంపేటలో రోడ్డుకు అడ్డంగా పత్తి ట్రాక్టర్లను పెట్టి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా నిర్వాహకులు కొనడం లేదని మండిపడుతున్నారు. మిల్లు యాజమాన్యం, మార్కెటింగ్ అధికారులు కుమ్మక్కై దళారులు తెచ్చిన పత్తినే కొంటున్నారని ఆరోపించారు.

## జిన్నింగ్ మిల్లుల్లో తనిఖీలు చేయండి

### అధికారులకు తుమ్మల ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): జిన్నింగ్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు గురువారం పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరి కొనుగోళ్లపై పర్యవేక్షణకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు పత్తి కొనుగోళ్లపై కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై సమగ్ర వివరాలు అందించే విధంగా ఒక వెబ్ పోర్టల్ తయారు చేసినట్టు తెలిపారు. దీంతో కొనుగోలు, రిజెక్ట్ చేసిన పత్తి వివరాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలని రైతులకు మంత్రి సూచించారు. పత్తి అమ్ముకోవడంలో సమస్యలు ఎదురైతే వాట్సాప్ (8897281111) ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

# సర్కార్ మా గోడు పట్టించుకుంటలేదు

- నెల దాటినా ధాన్యం కొంటలేదు
- బయట అమ్ముకునుడే మేలు
- ఎర్రబెల్లితో రైతుల ఆవేదన



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఎర్రబెల్లికి సమస్యలు వివరిస్తున్న రైతులు

వర్ధన్నపేట, నవంబర్ 7: ‘నెల రోజులు దాటినా ఇంతవరకు వడ్లు కొంటలేరు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి కేంద్రాలకు తీసుకపోదామన్నా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. మా సమస్యలు ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టడం లేదు’ అని రైతులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో మొరపెట్టున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో గురువారం ఎర్రబెల్లి పర్యటించారు. గ్రామ సమీపంలో రైతులు ధాన్యం ఆరబెట్టుకున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు సమస్యలను దయాకర్‌రావుతో పంచుకున్నారు.

**ఎర్రబెల్లి:** ధాన్యం ఇక్కడే ఉన్నది.. అమ్ముకోలేదా ఇంకా?

**రైతు ఆబర్ల రాజు:** కాంటాలు అయితలేవని ఇక్కన్నే ఆరబోసుకున్నం. 15 రోజులైతాంది వడ్లు తీసుకొచ్చి. ఏం చెయాలె సారు. ప్రైవేటుకు అమ్ముదామనుకుంటానం.

**రైతు అనిమిరెడ్డి మల్లారెడ్డి:** కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొంటలేరు. మిల్లులు అలాట్ కాకపోయే సరికి కొంటలేమని చెబుతాండ్లు. కొబ్బరికాయ కొట్టి కేంద్రాన్ని ప్రారంభించి 15 రోజులు దాటినా ఇంతవరకు ఒక్క గింజా కొనలేదు. ఏమిచెయ్యాలె. అందుకే ఇక్కన్నే ఉంచినం.

**ఎర్రబెల్లి:** 500 బోనస్ ఇస్తమంట్లాండ్లు కదా?

**రైతు బొంతల కుమారస్వామి:** ఇంతవరకు కొనుగోళ్లే ప్రారంభం చెయ్యలేదు. రూ.500 బోనస్ ఇచ్చుడెక్కడిది. అన్ని ఒట్టి మాటలు చెప్పుకుంట కాలం వెళ్లదీస్తాండ్లు. ఆరబెట్టుకొని రావాలే అంటాండ్లు. మొత్తం ధాన్యం ఎండి ఉన్నది. ఇంకా ఎంత ఆరబెట్టాలె.. ఏమిచెయ్యాలె సారు..

**ఎర్రబెల్లి:** రుణమాఫీ అయ్యిందా?

**రైతు అడుప రాజు:** రుణమాఫీ కాలేదు సార్

**ఎర్రబెల్లి:** రైతుబంధు వచ్చిందా?

**రైతు కుమారస్వామి:** రైతుబంధు ఇంక వత్తదా సార్. యాసంగి వరి నాట్లు పోసినంక ఇస్తామంటాండ్లు కదా. ఇత్తరో లేదో తెలువది. ఏమి చెయ్యాలె.. ముఖ్యమంత్రియి మాటలే అయితానై.. చేతలు ఎక్కడ కూడా లేవు.

**ఎర్రబెల్లి:** మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు వడ్లు మొత్తం కొంటామని చెబుతండ్లు కదా?

**రైతులు:** కొనుడులేదు మన్నులేదు. ధాన్యాన్ని మూడు సార్ల వడ్లు తూర్పారబట్టాల్నట. గింజల సైజును కూడా కొలిసిన తరువాతనే కొనుగోలు చేస్తరట. అయన్నీ మేమెక్కడ చేసేది. దీనంతటికంటే బయట ప్రైవేటుకే అమ్ముకోవడం ఉత్తమం. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు ఏ ఇబ్బంది లేకుంట వడ్లు అమ్ముకున్నం. రైతుబంధు సమయానికి వచ్చింది. ఇప్పుడు ఏదీలేదు. ఏమి చెయ్యాల్నో తెలుత్తలేదు.

## గింజ కొంటే ఒట్టు

### మహబూబాబాద్ రైతుల ఆవేదన

మహబూబాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ జిల్లాలో ధాన్యం కొనేవారు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకాకపోవడంతో అగ్గువ సగ్గువకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1,83,210 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2,88,782 టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 226 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కోతలు గత నెలలోనే మొదలయ్యాయి. ఈ సారి ధాన్యానికి గ్రేడ్-ఏ రకానికి రూ.2,320, గ్రేడ్- బీ రకానికి రూ.2,300 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కాకుండా సన్న వడ్లకు అదనంగా రూ.500 ఇస్తామని ప్రకటించింది. ప్రకటనల వరకు బాగానే ఉన్నా అమలులోకి వచ్చేసరికి రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. 226 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పి, జిల్లాలో అక్కడక్కడ కొన్ని ప్రారంభించారు. ప్రారంభించిన వాటిలో కూడా ఇంకా కొనడం లేదు. వరి కోసిన రైతులు ఏమి చేయాలో తెలియక ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ రైతులకు దక్కకుండాపోతుంది. జిల్లాలో అక్కడక్కడ ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో కూడా అధికారులు తేమ పేరిట వడ్ల కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. రైతులు దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

- **ప్రైవేటు వ్యాపారికే అమ్ముకున్న**

నాకున్న వ్యవసాయ భూమితో పాటు కౌలుకు తీసుకొని వరి వేసిన. భారీ వర్షాలతో సగం నష్టపోయా. ఇప్పటివరకు మా మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాకు రూ. 2150 చొప్పున అమ్ముకున్నం. ప్రభుత్వం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర చెల్లించడంతోపాటు సన్న వడ్లకు బోనస్ రూ.500 ఇస్తమన్నది. కొనుగోలు కేంద్రాలే ఏర్పాటు చేయకపోవడంతో చాలా నష్టపోయా. క్వింటాకు రూ. 500 బోనస్ లేకపోగా, అసలు మద్దతు ధరలో రూ.150కి తక్కువగా అమ్ముకున్న.

**- దొనికెన సోమన్న, రైతు, కొమ్ములవంచ**

# డీఏపీకి కటకట!

- రాష్ట్రంలో నిండుకున్న బఫర్ స్టాక్
- కావాల్సింది 1.5 లక్షల టన్నులు
- ప్రస్తుతం ఉన్నది 10 వేల టన్నులే

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): యాసంగి పంటల సాగుకు డీఏపీ ఎరువుల కొరత తప్పదా? మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ వద్ద బఫర్ స్టాక్ నిండుకున్నదా? డీఏపీ సరఫరాపై ఎరువుల కంపెనీలు చేతులెత్తేశాయా? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వీటికి అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. యాసంగి సాగుకు డీఏపీ కొరత ముప్పు పొంచి ఉన్నట్టుగా వ్యవసాయ శాఖ వర్గాల్లో హెచ్చరికలు వస్తున్నాయి. అవసరమైన స్థాయిలో సరఫరా లేకపోవడమే ఇందుకు కారణమని తెలిసింది. దీనికితోడు వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ వద్ద బఫర్ స్టాక్ నిల్వలు భారీగా పడిపోయినట్టు తెలిసింది. మరోవైపు ప్రైవేటు కంపెనీలు డీఏపీ సరఫరాపై చేతులెత్తేసినట్టు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలో యాసంగి పంటల సాగు ప్రారంభమైంది.



ఇలాంటి పరిస్థితుల్లో డీఏపీ కోసం రైతులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### నిండుకున్న నిల్వలు!

వాస్తవానికి యాసంగి సీజన్‌కు సుమారు 1.5 లక్షల టన్నుల వరకు డీఏపీ అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసినట్టు తెలిసింది. నవంబర్ నెలాఖరు వరకు సుమారు 65 వేల టన్నుల డీఏపీ నిల్వలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 10 వేల టన్నులలోపే నిల్వలు ఉన్నట్టు సమాచారం. ఎరువులకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న మార్క్‌ఫెడ్ వద్ద కేవలం 3 వేల టన్నుల బఫర్ స్టాక్ ఉన్నట్టు తెలిసింది. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో 80 వేల టన్నుల డీఏపీ అవసరం ఉంటుంది. కానీ ఆ స్థాయిలో కంపెనీలు సరఫరా చేసే పరిస్థితి లేదని తెలిసింది. దీంతో ఈ సీజన్‌లో డీఏపీ కొరత తప్పదనే హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి.

### నిరుడు బీఆర్ఎస్ సర్కారు ముందుచూపు

నిరుడు యాసంగి సాగుకు ముందే డీఏపీని అందుబాటులో ఉంచడం గమనార్హం. నిరుడు అక్టోబర్‌లో 30 వేల టన్నులు, నవంబర్‌లో 30 వేల టన్నులు, డిసెంబర్‌లో 35 వేల టన్నులు, జనవరిలో 29 వేల టన్నుల డీఏపీని అప్పటి ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దీంతో రైతులకు అవస్థలు రాకుండా సర్కారు ముందుచూపుతో వ్యవహరించింది. డీఏపీ ఎరువుల కొరత దేశవ్యాప్తంగా కొనసాగుతున్నది. ఇప్పటికే పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఇది తీవ్రస్థాయికి చేరింది. డీఏపీ లభించక అక్కడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆందోళనల దాకా పరిస్థితి చేరింది. ఇది క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. తెలంగాణ, ఏపీ వంటి రాష్ట్రాల్లో మరో నెలరోజుల్లో యాసంగి పంటలు ఊపందుకోనున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో డీఏపీ లభించని పక్షంలో గందరగోళ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నది.

### చేతులెత్తేసిన కంపెనీలు

డీఏపీ సరఫరాపై ఎరువుల కంపెనీలు చేతులెత్తేసినట్టు తెలిసింది. డీఏపీ తయారీకి అవసరమైన ముడి సరుకుల ధరలు భారీగా పెరగడంతో ఉత్పత్తిని తగ్గించినట్టు ఓ కంపెనీ ప్రతినిధి ద్వారా తెలిసింది. ముఖ్యంగా ఈస్టర్న్ యూరప్, పశ్చిమ దేశాల్లో, ఇజ్రాయిల్, హమాస్ యుద్ధంతో డీఏపీ ముడి వనరుల ధర భారీగా పెరిగినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా డీఏపీపై సబ్సిడీని పెంచేందుకు నిరాకరించినట్టు తెలిసింది. దీంతో నష్టాలు భరించి తయారుచేసి సప్లై చేయలేక కంపెనీలు చేతులెత్తేసినట్టు తెలిసింది. ఓ ప్రముఖ కంపెనీ ఈ ఏడాది కేవలం 5 వేల టన్నుల సరఫరాకే పరిమితమైనట్టు సమాచారం.